నమస్తే తెలంగాణ

ములుగు

జయశంకర్ భూపాలపల్లి

5 | వరంగల్, గురువారం 12 సెప్టెంబర్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY


## ● లంబోదరుడికి 2,100 కిలోల లడ్డూ..

### స్వామికి సమర్పించిన డోసైల్ డెలివరీ సర్వీసెస్



వరంగల్ పాపయ్యపేట చమన్ గణపతి వద్ద ఏర్పాటు చేసిన భారీ లడ్డూ ప్రసాదం

మట్టెవాడ, సెప్టెంబర్ 11 : గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వరంగల్ నగరంలోని పాపయ్యపేట చమన్ మండపం వద్ద పెట్టిన లడ్డూ రికార్డు సృష్టించింది. 2,100 కిలోల లడ్డూ ప్రసాదాన్ని డోసైల్ డెలివరీ సర్వీసెస్ వారు వినాయకుడికి సమర్పించారు. ఈ ప్రసాదాన్ని 400 కిలోల శనగపప్పు, 900 కిలోల చక్కెర, 200 కిలోల డ్రై ఫ్రూట్స్, 350 కిలోల నెయ్యి, నూనె ఉపయోగించి తయారు చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. గణపతిపై తమకున్న భక్తితో లడ్డూ ప్రసాదాన్ని తయారు చేశామని, నిమజ్జనం రోజు తమ కంపెనీ యాప్ డౌన్లోడ్ చేసుకొని బుక్ చేసుకున్న భక్తుల ఇంటికి ఫ్రీగా లడ్డూ ప్రసాదాన్ని పంపిస్తామని చెప్పారు. రాష్ట్రంలోనే ఇది భారీ లడ్డూగా రికార్డుల్లో నిలుస్తుందని భక్తులు చెబుతున్నారు.



నష్టం వివరాలను తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు



పాఠాలు బోధిస్తున్న సీఆర్పీ బాలాజీనాయక్

## అక్కడ సీఆర్పీలే ఉపాధ్యాయులు

### టీచర్లు లేక రెడ్డిపల్లి పాఠశాల విద్యార్థుల అవస్థలు

మహాముత్తారం, సెప్టెంబర్ 11 : సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న సీఆర్పీలే ఆ పాఠశాల విద్యార్థులకు దిక్కయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం రెడ్డిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో 35 మంది విద్యార్థులున్నారు. ఇటీవల చేపట్టిన బదిలీల్లో ఇక్కడి ఉపాధ్యాయులు ఇతర పాఠశాలలకు వెళ్లిపోయారు. ఇక్కడ ఎవరినీ నియమించకపోవడంతో పాఠాలు చెప్పేవారు లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న సీఆర్పీలు స్కూల్‌కు వచ్చి పాఠాలు బోధిస్తున్నారు. అధికారులు వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## 436 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

వర్ధన్నపేట, సెప్టెంబర్ 11: మండలకేంద్రం సమీపంలోని మహేశ్వర రైస్ మిల్లులో పోలీసులు పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. రైస్‌మిల్లులో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో బుధవారం మిల్లుకు వెళ్లి తనిఖీ చేయగా, పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. నర్సంపేట మండలం తిర్మలాయపల్లి సమీపంలోని రైస్‌మిల్లు, ఖిలావరంగల్ శ్రీసాయిరాం మిల్లు నుంచి 436 క్వింటాళ్ల బియ్యాన్ని ఈ మిల్లుకు తీసుకొచ్చినట్లు నిర్వాహకుడు రాజు తెలిపాడు. ఈ బియ్యం విలువ రూ. 11,33,600 ఉన్నట్లు సివిల్ సప్లయ్ అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

## కేయూ భూములకు మార్కింగ్

### ఆక్రమణలపై కొనసాగుతున్న అధికారుల సర్వే



లష్కర్‌సింగారంలో కేయూ భూములకు మార్కింగ్ చేస్తున్న అధికారులు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 10 : కాకతీయ యూనివర్సిటీ (కేయూ) భూములకు బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, ల్యాండ్ సర్వే అధికారులు మార్కింగ్ చేశారు. వర్సిటీలోని జ్యోతిరావుపూలే బాయ్స్ పీజీ హాస్టల్ (లష్కర్‌సింగారం) వైపు సర్వే నెంబర్ 229లో ఆక్రమణకు గురైన భూములను అధికారులు సర్వే చేసి హద్దులు గీశారు. కేయూ భూముల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 229 సర్వే నంబర్‌లో తనిఖీలు నిర్వహించి 6.15 ఎకరాల భూమికి బౌండరీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కాంపౌండ్‌వాల్ నిర్మించిన యజమానుల భూ పత్రాలను పరిశీలించామని, 214 సర్వే నంబర్‌లో మరోమారు సర్వే చేస్తామని చెప్పారు. 1980లో సర్వేనంబర్ 236లో భూమి కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నామని, యూనివర్సిటీ భూములతో తమకు ఎలాంటి సంబంధం లేదని అక్కడ నివసిస్తున్న వారు అన్నారు. కాకతీయ యూనివర్సిటీకి 680 ఎకరాల భూమి ఉంటుందని, అందులో కొంతభాగం ఆక్రమణకు గురికావడంతో ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి తెలిపారు. యూనివర్సిటీ భూములను కాపాడతామని, ఆక్రమించిన వారు ఎంతటివారైనా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## ఐసీఏఆర్‌లో మెరిసిన మనోళ్లు

### 2,6 ర్యాంకులు సాధించిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు



వెల్ది హర్షిత, రెండో ర్యాంకు



బండేవాలి శ్వేత, ఆరో ర్యాంకు

కాశీబుగ్గ, సెప్టెంబర్11: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఐసీఏఆర్‌లో రెండు ర్యాంకులు సాధించారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్ నిర్వహించిన జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ పరీక్షల్లో వెల్ది హర్షిత వాటర్ సైన్స్ టెక్నాలజీ విభాగంలో రెండో ర్యాంకు సాధించింది. అలాగే వ్యవసాయ విస్తరణ విభాగంలో పూర్వపు విద్యార్థి బండేవాలి శ్వేత సీనియర్ రిసెర్చ్ ఫెల్లోషిప్ పరీక్షల్లో జాతీయస్థాయిలో 6వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీలో మొదటి ర్యాంకును కైవసం చేసుకుంది. విద్యార్థులు సాధించిన విజయాలతో తమ కళాశాల పేరు ప్రఖ్యాతులు మరింత పెరుగుతాయని అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం బలరాం హర్షం వ్యక్తం చేశారు.

## కూలిన చెట్లపై కొనసాగుతున్న సర్వే

తాడ్వాయి సెప్టెంబర్11 : తాడ్వాయి, మేడారం రహదారిలో గత నెల 31న సుడిగాలి బీభత్సంతో నేలకూలిన చెట్లపై సర్వే కొనసాగుతోంది. జిల్లాలోని 220 మంది అటవీ సిబ్బందితో పది రోజులుగా కూలిన వృక్షాలపై సర్వే నిర్వహిస్తున్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా ములుగు అటవీ శాఖ రీసెర్చ్ సెంటర్ నుంచి 50 మంది ధ్వంసమైన అడవిని పరిశీలించారు. సుమారు 500 ఎకరాలకు 150 ఎకరాల్లో మాత్రమే సర్వే పూర్తయింది. మరో 15 రోజులు సర్వే ఉంటుందని, పూర్తయ్యాక ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని అధికారులు తెలిపారు.



మరిపెడ మండలంలో కొట్టుకుపోయిన ముల్కలపల్లి బ్రిడ్జిని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

# చీకట్లో ఉరుకులు.. పరుగులు

మూడు గంటల్లోపే ముగించేశారు..



టార్చ్‌లైట్ వెలుతురులో పురుషోత్తమాయగూడెం బ్రిడ్జిని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

మూడు రోజులు కుంభవృష్టి వానలతో ఇండ్లు, పంటలు, వాహనాలు అన్నీ కోల్పోయి జనజీవనం అస్తవ్యస్తమై సాయం కోసం ఎదురుచూస్తున్న వేళ.. వరద నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్రం బృందం పొద్దుపోయాక మానుకోటకు చేరుకుంది. మూడు గంటల ఆలస్యంగా రాత్రి 7 గంటలకు ఖమ్మం నుంచి వచ్చి రాత్రివేళ ఉరుకులు.. పరుగులతో హడావిడి చేసింది. పల్లెల్లో అంతా నిద్రపోయే సమయానికి టార్చ్‌లైట్, వాహనాలు, సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో డోర్నకల్, మరిపెడ మండలాల్లోని వరద ప్రభావిత ప్రాంతాలతో పాటు కొట్టుకుపోయిన వంతెనలను అతి కష్టం మీద చూశారు. సమయం లేకపోవడం, నేరుగా క్షేత్రస్థాయిలో పంటలను చూసే పరిస్థితి లేక వరదకు కొట్టుకుపోయిన పంటలను ఫొటో ఎగ్జిబిషన్, వీడియో రూపంలో వీక్షించారు. పలువురి ఇంటికి వెళ్లి వరద ఎంత వచ్చింది.. నీటి ప్రవాహ ఉధృతిపై ఆరా తీసి ఏయే వస్తువులు పోయాయని అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులను పలకరించగా పొలాల్లో ఇసుక మేటలు, రాళ్లు కొట్టుకొచ్చి ఎకరానికి లక్ష దాకా నష్టం వచ్చిందని మీరే ఆదుకోవాలని సారు అంటూ వేడుకున్నారు. ఇలా చివరగా ముల్కలపల్లిలో రాత్రి 9.30గంటలకు పర్యటన ముగించుకొని మళ్లీ ఖమ్మం బయల్దేరారు.

- మహబూబాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ)/మరిపెడ/కురవి/డోర్నకల్

### మానుకోట జిల్లాలో హడావుడిగా కేంద్ర బృందం పర్యటన

- పొద్దుపోయాక వరద నష్టం పరిశీలన
- టార్చ్‌లైట్, సెల్‌ఫోన్ల లైట్ల వెలుతురులో కలియదిరిగిన అధికారులు
- ముంపు ప్రాంతాలను పరిశీలించిన కేంద్రబృందం
- ఉల్లెపల్లి, సీతారాంతండా వాసులను వివరాలు అడిగి తెలుసుకున్న సభ్యులు
- పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి, దెబ్బ తిన్న రహదారుల పరిశీలన



నష్టానికి సంబంధించిన ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న కేంద్ర బృందం

మహబూబాబాద్ జిల్లాలో వరద నష్ట వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు బుధవారం రాత్రి కేంద్ర బృందం సభ్యులు కల్నల్ కేపీ సింగ్, మహేశ్‌కుమార్, శాంతినాథ్ శివప్ప కాగి, ఎస్‌కే కుష్వాహ, టీ నియలకన్సన్, డాక్టర్ శశివర్ధన్, స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్, సెక్రెటరీ మైన్స్ అండ్ జియాలజీ సురేంద్రమోహన్ మరిపెడ మండలంలోని ఉల్లెపల్లి, సీతారాంతండా, గాలివారి గూడెం, పురుషోత్తమాయ గూడెం బ్రిడ్జిలను పరిశీలించారు. ముందుగా మరిపెడ రోడ్లు, భవనాల అతిథిగృహంలో మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ కేంద్ర బృందం సభ్యులకు స్వాగతం పలికారు. అక్కడినుంచి గాలివారిగూడెం మీదుగా ఉల్లెపల్లికి చేరుకున్నారు. గ్రామంలో నీట మునిగిన పంట చేన్లు, గ్రామంలోకి చేరిన నీటి ప్రవాహంపై ఫొటో ప్రదర్శనను వారు వీక్షించారు. అర్ధరాత్రి వరద రావడంతో భయపడ్డామని.. ప్రాణాలతో బయటపడ్డాం కానీ.. సర్వం కోల్పోయిన తమను అన్ని విధాలా ఆదుకోవాలని స్థానిక మహిళ బొట్టు కోటమ్మ కోరింది. అనంతరం వల్లోజు భిక్షం ఇంటిని పరిశీలించి వరద ప్రవాహంపై ఆరా తీశారు. సీతారాంతండాలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఫొటో ప్రదర్శనతో పాటు ల్యాప్‌టాప్‌లో వరద ఉధృతిని కేంద్ర బృందానికి వివరించారు. తండాలో ఇస్లావత్ మంగీలాల్ గృహాన్ని పరిశీలించారు. వరద ఉధృతి ఎంతవరకు వచ్చిందని ఆ రోజు ఏం జరిగిందని అడిగి తెలుసుకున్నారు. ఇప్పుడేనా.. గతంలో ఎప్పుడైనా వరద వచ్చిందా.. అంటూ గృహ యజమాని మంగీలాల్, కవిత దంపతులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు సీతారాంతండాకు నాలుగు సార్లు వరద వచ్చింది కానీ ఇంత తీవ్రత ఎప్పుడూ లేదని మంగీలాల్ బదులిచ్చారు. ఇంట్లోని వస్తువులతో పాటు నిత్యావసరాలు, తినుబండారాలు, పత్రాలన్నీ వరద పాలయ్యాయన్నారు. ప్రాణాలు అరచేతులో పెట్టుకుని డాబాల మీదకు పరుగులు తీశామని చెప్పుకున్నారు. ప్రమాదం ఎప్పుడూ పొంచి ఉంటుందని, తండాను వేరే ప్రాంతానికి తరలిస్తే మంచిదన్నారు. ఆ తర్వాత కేంద్ర బృందానికి తండా మహిళలు పలు విషయాలను దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా తండాను మరో చోటికి మార్చాలని, ఈ ముంపు భవిష్యత్తులో కూడా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. భయంభయంగా బతుకుతున్నామని, మరో సురక్షిత ప్రాంతంలో తండాను నిర్మిస్తే బాగుంటుందని మహిళలు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) డేవిడ్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగేంద్రరావు, తొర్రూరు ఆర్డీఓ నరసింహారావు, మరిపెడ తహసిల్దార్ డి.సైదులు, ఇరిగేషన్, జిల్లా వ్యవసాయ శాఖాధికారిణి విజయనిర్మల, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. డోర్నకల్ మండలంలోని ముల్కలపల్లి ఎస్సీకాలనీకి కేంద్ర బృందం వెళ్లి వరద బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఈ క్రమంలో సోమమ్మ ఇంటికి వెళ్లి ఆరా తీశారు. అలాగే వరద ధాటికి కొట్టుకుపోయిన ఆకేరు వాగు బ్రిడ్జిని పరిశీలించారు. అధికారులతో, రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఎన్.అశోక్ అనే రైతు కేంద్ర బృందం సభ్యులతో మాట్లాడారు. ఒక్కో ఎకరానికి లక్ష రూపాయలు నష్టం జరిగిందని, పంట పొలాలలో ఇసుక మేటలు, రాళ్లు వచ్చి భూములు వ్యవసాయానికి పనికిరాకుండా ఉన్నాయన్నారు. ప్రభుత్వమే పంట పొలాలలో రేగడి మట్టి తొలగించి వ్యవసాయానికి ఉపయోగపడేలా చేయాలని కోరారు.



మరిపెడ మండలం సీతారాంతండాలో జరిగిన నష్టాన్ని ఫొటో ప్రదర్శన ద్వారా కేంద్ర బృందానికి వివరిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

### మా గోస పట్టదా?

ఊహించిన వరదల నుంచి మానుకోట జిల్లా ప్రజలు ఇంకా తేరుకోనే లేదు. వరదల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చినా తక్షణ సాయమేదీ అందక ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం కేంద్ర బృందం పర్యటించింది. సాయంత్రం నాలుగు గంటలకు రావాల్సిన అధికారులు రాత్రి 7గంటలకు వచ్చారు. అక్కడి నుంచి మొదలైన హడావిడి ఉరుకులు, పరుగులతోనే సరిపోయింది. రెండు బృందాలుగా విడిపోయిన సభ్యులు ఒక బృందం రోడ్లు, బ్రిడ్జిలకు జరిగిన నష్టాన్ని చూస్తూ వెళ్లారు. మరొక బృందం గ్రామాలు, తండాల్లో పర్యటిస్తూ ఫొటో ఎగ్జిబిషన్లను తిలకిస్తూ ఒకరిద్దరితో మాట్లాడుతూ ముందుకు సాగారు. బృందాల వెంట వాహనాల హడావుడి ఎక్కువైంది. త్వరగా వెళ్లాలనే ఆత్రుతతో.. లేక సరైన టూర్ షెడ్యూల్ లేకనో ప్రజలు చెప్పేది అరకొరగా విని గాలికి వదిలేశారు. ప్రజలు తమ బాధలు చెప్పుకుంటుంటే వింటూ ఒకే కేంద్రానికి నివేదిస్తాం అంటూ వెళ్లిపోయారు. కేంద్ర బృందాల అలా వచ్చి ఇలా వెళ్లడం చూసి ప్రజలు ఇంత మాత్రానికి అసలు ఎందుకొచ్చినట్లు అంటూ విసుకున్నారు. గ్రామాల్లో, తండాల్లో ప్రజలు నిద్రపోయే వేళలు వచ్చి టార్చ్‌లైట్లు, కారు లైట్లు వేసుకొని వచ్చి నష్టాన్ని పరిశీలించడంతో తమ గోస పట్టదా అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మరో రోజు పగటిపూట వస్తే తమ బాధలు వారికి కనబడేదని గ్రామస్తులు బృందాలు వెళ్లిన వెంటనే గుసగుసలాడుకోవడం వినిపించింది.



బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న బృందం

## రామప్ప అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- హైదరాబాద్‌లో అధికారులతో సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ) : యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లో ఇన్‌టాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు తదితరులతో కలిసి అధికారులతో రామప్ప అభివృద్ధి పనులపై మంత్రి సమీక్షించారు. తెలంగాణలో వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన ఏకైక కట్టడం రామప్ప అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి యునెస్కో విధించిన గడువులోపు పనులు పూర్తి చేయాలన్నారు. త్వరలో కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ సైతం ములుగులో ఏర్పాటు కాబోతున్నదన్నారు. వారసత్వ సంపదను భవిష్యత్ తరాలకు, ప్రపంచ దేశాలకు చాటిచెప్పే యజ్ఞంలో అన్ని శాఖల అధికారులు భాగస్వాములు కావాలన్నారు. ఆలయానికి, చెరువుకు ఆటంకం కలిగించే అభివృద్ధి పనులకు అనుమతులు ఇవ్వబోమని సీతక్క స్పష్టం చేశారు. సమావేశంలో కలెక్టర్ టీఎస్ దివాకర, ఇరిగేషన్ సీఈ విజయ్‌భాస్కర్‌రావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పాపారావు, టూరిజం ప్రిన్సిపల్ కార్యదర్శి వాణీ ప్రసాద్, కాకతీయ ట్రస్ట్ సభ్యుడు శ్రీధర్‌రావు, పురావస్తు శాఖ సూపరింటెండెంట్ స్మిత ఎస్ కుమారి, టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డి, పురావస్తు శాఖ డీడీ నారాయణ, సీఏ మల్లేశ్, రామప్ప ఈవో శ్రీనివాస్, డీటీవో శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## తమ్ముడి మృతి తట్టుకోలేక.. ఆగిన అక్క గుండె..





శంకర్, రుక్కమ్మ (ఫైల్)

లింగాలఘనపురం, సెప్టెంబర్ 11 : తమ్ముడి మృతిని తట్టుకోలేక ఓ అక్క గుండె ఆగింది. ఈ ఘటన జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం నెల్లుట్లలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గాడిపెల్లి శంకర్ (50) కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. ఆదే గ్రామంలో నివాసం ఉంటున్న ఆయన అక్క కొలుపుల రుక్కమ్మ (54) తమ్ముడిని చూసి గుండెపోటుకు గురైంది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జనగామ, అనంతరం హైదరాబాద్‌లోని దవాఖానలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన నెల్లుట్లలో విషాదాన్ని నింపింది.



జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామంలో వినాయకుడి మండపానికి రక్షణగా వలను ఏర్పాటు చేసిన నిర్వాహకులు

## మండపానికి వల.. దేవుడికి రక్ష

మనకు దేవుడు రక్షణ అయితే ఆ ఆది దేవుడికి వల రక్షణగా మారింది. నవ రాత్రులు భక్తుల పూజలు అందుకుని, వారి కష్టాలను తొలగించే ఆ బొజ్జ గణపయ్య మండపంలో దేవుడి కోసం ఏర్పాటు చేసిన ప్రసాదాలను, లడ్డూలను కోతులు ఎత్తుకుపోకుండా ఉండేందుకు మండలంలోని తాటికొండ గ్రామంలో గణపయ్య మండపానికి నిర్వాహకులు వలను ఏర్పాటు చేశారు.

- స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 11

## తహసీల్దార్ కోమిపై చీటింగ్ కేసు

- వ్యక్తి బతికుండగానే చనిపోయినట్లు ధ్రువీకరణ
- మరొకరి పేరిట పట్టాదారు పాసు పుస్తకం జారీ
- సహకరించిన మరో నలుగురిపైనా కేసు నమోదు



తహసీల్దార్ కోమి (ఫైల్)

పర్వతగిరి, సెప్టెంబర్ 11 : తాను బతికుండగానే చనిపోయినట్లు ధ్రువీకరించి తన పేరిట ఉన్న భూమిని మరొకరికి పట్టా మార్పిడి చేశారని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ కోమితో పాటు మరో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన ఎర్రం మల్లయ్యకు సర్వే నెంబరు 185/7/1లో 1.25 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గతంలో తీసుకున్న క్రాప్ లోన్‌కు సంబంధించి రుణమాఫీ కాలేదని, పీఎం కిసాన్ యోజన డబ్బులు రాలేదని బ్యాంకు అధికారులను మల్లయ్య ఆరా తీశాడు. దీంతో వారు పరిశీలించి అతడి పేరిట భూమే లేదని తేల్చిచెప్పారు. భూమిని ఎవరికో అమ్ముకున్నావని, బ్యాంకులో తీసుకున్న క్రాప్‌లోన్ డబ్బులు కట్టాలన్నారు. వేరే వారికి పీఎం కిసాన్ డబ్బులు పడ్డాయని వ్యవసాయ అధికారులు తెలపడంతో, ఆర్టీఐ ద్వారా సమాచారం తెలుసుకున్న మల్లయ్య రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశాడు. 2023లో అజ్మీరా కోమి పర్వతగిరి తహసీల్దార్‌గా పని చేసిన సమయంలో మల్లయ్య భూమిని అతడి బంధువు ఎర్రం దూడయ్యకు అక్రమంగా పట్టా చేసినట్లు రుజువులున్నాయని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం వేలేరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న కోమిపై చీటింగ్ కేసుతో పాటు, ఎర్రం దూడయ్య, అతడికి సహకరించిన స్థానిక గ్రామస్తులు వెంకటేశ్వర్లు, రాజు, అఫ్సర్ పాషాపై ఫోర్జరీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ఆ ఊర్లో దెయ్యం.. భయం!

- ఓ వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్
- భయంతో వణుకుతున్న గిరిజనం

కన్నాయిగూడెం, సెప్టెంబర్ 11: మండలంలోని ఓ గ్రామంలో దెయ్యం తిరుగుతున్నదని ఒకరు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో రెండు రోజులుగా గిరిజనులు భయంతో వణికిపోతున్నారు. దీంతో కొందరు దేవర దగ్గరకు పోయి కాపాడాలని మొక్కుతున్నట్లు తెలిసింది. అసలు వీడియోలో ఏముంది?, ఎందుకు అంతా భయభ్రాంతులకు గురవుతున్నారో తెలియడం లేదు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రాత్రి సమయంలో వీడియో ఆన్ చేసి చెట్టుకు కట్టినట్లు తెలుస్తోంది. వీడియోలో అంతా చీకటిగా కనిపిస్తూ గజ్జెల పట్టీలు, ఏడుపు శబ్దం రికార్డు అయినట్లు ఉంది. గ్రామంలో ఎండాకాలంలో యువతి, యువకుడు వేర్వేరుగా ఆత్మహత్య చేసుకున్నారని, అందులో యువతి దెయ్యం అయ్యిందని, రాత్రి గ్రామంలో తిరగడంతో కాళ్లకు గజ్జెల పట్టీలున్న శబ్దంతో పాటు ఏడుపు వినిపిస్తుందని కొందరు ప్రచారం చేస్తున్నారు. దానికి తగినట్లుగా అందరి ఫోన్లకు సోషల్ మీడియా ద్వారా వీడియో రావడంతో మరింత భయపడుతున్నారు. అధికారులు అవగాహన కల్పించి భయం పోగొట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.